



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 188

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 5 డిసెంబరు 2023


## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లాల కలెక్టర్లకు నిధులు విడుదల ●అత్యవసర ఖర్చులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు ● ప్రతి జిల్లాకుప్రత్యేక అధికారుల నియామకం ●ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ● ఎనిమిది మంది జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**గుంటూరు,కలంకౌంటర్ :** తుపాను దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనిమిది మంది జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈరోజు(సోమవారం) తుపాను ప్రభావం ఉండే పలు జిల్లాల కలెక్టర్లతో తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తుపాను సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. హుద్ హుద్ లాంటి పెద్ద పెద్ద తుపాన్లను చూసిన అనుభవం మనకు ఉందని, తుపాన్లను ఎదుర్కోవడంలో మన యంత్రాంగానికి మంచి అనుభవం ఉందని చెప్పారు. తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉంటూ యంత్రాంగం సీరియస్‌గా ఉండాల్సిన అవసరం ఉందిని, బాపట్ల సమీపంలో తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారన్నారు. గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు నిధులు విడుదల చేశామని వెల్లడించారు. అత్యవసర ఖర్చులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

**ప్రతి జిల్లాకుప్రత్యేక అధికారుల నియామకం :** ప్రతి జిల్లాకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నాం. వీరంతాకూడా జిల్లాల యంత్రాంగంతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తారు. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉంది. పశువులకూ ఎలాంటి ప్రాణనష్టం రాకూడదు. ఆ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలి. కోతకు వచ్చిన ఖరీఫ్ పంటను కాపాడుకోవడం అన్నది చాలా ముఖ్యమైనది. నిన్న ఒక్కరోజే 97 వేల టన్నులు ధాన్యాన్ని సేకరించాం. 6.5 లక్షల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. పంటకోయని ప్రాంతాల్లో వీలైనంత మేర కోయకుండా వాయిదా వేసుకుంటే మంచిదని అధికారులు చెప్తున్నారని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కోసిన ధాన్యాన్ని వెంటనే సేకరించడంపై అధికారులు దృష్టిపెట్టాలని, యుద్ధ ప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. తేమ, రంగు లాంటి అంశాలను పట్టించుకోకుండా రైతులకు అండగా నిలవాలని, తుపాను దృష్ట్యా రైతులకు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

**సురక్షిత ప్రాంతాలకు తరలించాలి :** తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాలనుంచి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, 308 శిబిరాల ఏర్పాటుకు గుర్తించామని, అప్పటివరకూ 181 తెరిచామని చెప్తున్నారని, అవసరమైన చోట వెంటనే శిబిరాలను తెరిచి ప్రజలను అక్కడకు తరలించాలని కోరారు. ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ టీమ్స్ 5, ఎస్డీఆర్ఎఫ్ టీమ్స్ 5 కూడా ఉన్నాయని, గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ, విలేజ్ క్లినిక్స్, ఆర్బీకేలు కూడా మనకు ఉన్నాయని, ఇది మనకు ఉన్న పటిష్టమైన బలమన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇలాంటి వ్యవస్థ లేదని, ఈ యంత్రాంగాన్ని బాగా వినియోగించుకోవాలని, ఈ వ్యవస్థను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలను రక్షించడంలో, తపాను వల్ల, భారీవర్షాల వల్ల దెబ్బతినే అవకాశాలున్న ప్రాంతాల్లో వీరి సేవలను వినియోగించుకోవాలని, సహాయక శిబిరాల్లో వచ్చే ప్రజలకు మంచి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. మనం ఉంటే ఎలాంటి సదుపాయాలు కోరుకుంటామో, అలాంటి సదుపాయాలు ఉండాలని, మందులు, తాగునీరు, మంచి ఆహారం అందించాలని, కాస్త డబ్బు ఖర్చైనా పర్వాలేదు, సదుపాయాలు విషయంలో ఎలాంటి లోటూ రాకూడదన్నారు.

**పరిహారాన్ని సకాలంలో అందించాలి :** క్యాంపునుంచి ఇంటికి వెళ్లేటపుడు చిరునవ్వుతో వారు ఇంటికి వెళ్లాలి. ప్రతి ఒక్కరికీ రూ.1000 లేదా కుటుంబానికి గతంలో మాదిరిగా కాకుండా రూ.500 పెంచి రూ. 2500 ఇవ్వాలి. క్యాంపులకు రాకుండా, ఇళ్లలోకి నీళ్లు చేరిన వారికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు కిలోచొప్పున అందించాలి. ఈ రేషన్‌ను వారికి సకాలంలో సక్రమంగా అందించాలి. గాలులు వల్ల, వర్షాల వల్ల గుడిసెల్లాంటివి దెబ్బతింటే వారికి రూ.10వేలు అందించాలని, బాధితుల పట్ల దయతో, సానుభూతితో పరిహారాన్ని సకాలంలో అందించాలని, తుపాను తగ్గుముఖం పట్టిన 24 గంటల్లో వీటిని అందించాలని కోరారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్లు వ్యవస్థను వినియోగించుకుని బాధితులను గుర్తించి వెంటనే వారికి ఇవ్వాల్సినవి ఇవ్వాలన్నారు.

**వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శిబిరాలు :** ఎమర్జెన్సీ సర్వీసుల నిర్వహణపై దృష్టిపెట్టాలన్నారు. జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణీలను ఆస్పత్రులకు తరలించాలని, తుపాను వల్ల వచ్చే వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికిన నిర్వహించాలని, విద్యుత్, రవాణా సౌకర్యాలకు అంతరాయం ఏర్పడితే వెంటనే యుద్ధ ప్రాతిపదికన వాటిని సరిచేయాలన్నారు. సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై ప్రత్యేకాధికారులు దృష్టిపెట్టాలని, తుపాను, వర్షాలు తగ్గాక పంటలకు జరిగిన నష్టంపై వెంటనే ఎన్యుమరేషన్ పూర్తిచేయాలన్నారు. నేను కూడా ప్రజల దగ్గరకు వెళ్లి కలెక్టర్లు బాగా చేశారా? లేదా? అడుగుతాను. బాగానే చేశారని ప్రజలు సంతోషంగా నాకు చెప్పాలి. తుపాను బాధిత ప్రాంతాల్లో తిరుగుతాను, ప్రభుత్వం యంత్రాంగం పనితీరుపై అడిగి తెలుసుకుంటాను. సహాయం అందలేదని, బాగా చూసుకోలేదన్న మాట బాధితులనుంచి వినిపించకూడదు. సంతృప్తకర స్థాయిలో బాధితులందరికీ సహాయం అందాలన్నారు. ఈ సాయంత్రం నుంచి ప్రత్యేకాధికారులు జిల్లాల్లో పర్యవేక్షణ ప్రారంభిస్తారని, డబ్బులు ఇంకా అవసరమైతే వెంటనే పంపించడానికి అన్నిరకాలుగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.






## ఏపీ రాజధాని అమరావతే: రాజ్యసభలో వెల్లడించిన కేంద్రం

●రాజ్యసభలో లిఖితపూర్వక ప్రకటన చేసిన కేంద్ర సహాయమంత్రి కౌశల్ కుమార్

● 28 రాష్ట్రాల రాజధానులకు మాస్టర్ ప్లాన్ ఉందని వెల్లడి

● కేంద్రం ఆమోదించిన మాస్టర్ ప్లాన్ జాబితాలో అమరావతి కూడా ఉందని స్పష్టీకరణ



**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీ రాజధాని అమరావతి అంటూ కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయమంత్రి కౌశల్ కుమార్ రాజ్యసభలో ఈ మేరకు లిఖితపూర్వక ప్రకటన చేశారు. 28 రాష్ట్రాల రాజధానుల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ఉందని, ఆ ప్లాన్ కు కేంద్రం ఆమోదం తెలిపిందని కౌశల్ కుమార్ తెలిపారు. ఈ జాబితాలో అమరావతి కూడా ఉందని స్పష్టం చేశారు. అమరావతికి కూడా మాస్టర్ ప్లాన్ ఉందని మంత్రి వెల్లడించారు. అమరావతి మాస్టర్ ప్లాన్ కు కూడా కేంద్రం ఆమోదం ఉందని వివరించారు.

## ఎర్రవెల్లి లోని తన నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం





**హైదరాబాద్,కలంకౌంటర్ :** బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సోమవారం గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లి లోని తన నివాసంలో పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు కేసీఆర్ ని కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. వారికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పలువురు మాజీ మంత్రులు ఇతర నేతలు కూడా సిఎం ని కలిసిన వారిలో ఉన్నారు.




# కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఘనంగా శివుడికి అభిషేకాలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కార్తీక సోమవారం పురస్కరించుకొని సోమవారం మచిలీపట్నం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ ఉమా సహిత సహస్ర లింగేశ్వర శివలింగానికి ఉదయం నుండి పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు నారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలు దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ 15వ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజదంపతులు, శ్రీపాద శ్రీపాద రంగనాయకులు సంక మల్లికార్జునరావు టి రమేష్ కలిసి సహస్ర శివలింగాలుతో ఏర్పాటు చేసిన భారీ శివలింగానికి ఆవు పాలు, అవు నెయ్యి, తేనె, పంచదార, వివిధ పళ్ళ రసాలు, వట్టేరు వేళ్ళు, పన్నీరు పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు చేసి స్వామివారిని సుందరంగా అలంకరించారు. అనంతరం శివలింగం ముందు కార్తీక దీపోత్సవాలను వెలిగించి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

# ఘనంగా మల్లు నందిని పుట్టినరోజు వేడుకలు



**మధిర,కలంకౌంటర్ :** మధిర సేవా సమితి ఆధ్వర్యంలోఅమ్మ ఫౌండేషన్ చైర్మన్, మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు కమిటీ సభ్యులు కోమటీడి శ్రీనివాసరావు, మిరియాల కాశీ విశ్వేశ్వరరావు, షేక్ జహంగీర్, కోమటి సుధాకర్, దొడ్డ వెంకటనారాయణ పద్మావతి, వేముల నవీన్ గార్లు మేడం నందినిని సన్మానించి,శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# విద్యుత్ అంతరాయం రానివ్వం: విద్యుత్ శాఖ అధికారి చంద్రశేఖర్



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** తుఫాను ను ఎదుర్కొని 24 గంట లు నిరంతరాయగా విద్యుత్ ఇవ్వటానికి సిద్దంగా వున్న పివి పాలెం మండలం విద్యుత్ శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఎక్కడ విద్యుత్ స్తంభాలు పడిపోయిన లేదా కరెంటు వైర్లు తెగిపడిన వాటిని తాకకుండా వెంటనే ఆ గ్రామ లైన్ మాన్ కి లేదా సబ్ స్టేషన్ కి లేదా ఏ. ఇ గారికి తెలియచేసి ప్రమాదాలను నివారించాలి అని సూచించారు. సమస్యలు తెలియజేయడానికి విద్యుత్ శాఖ ఏ. ఇ, కె. చంద్ర శేఖర్ 9440812316 పి.వి పాలెం సబ్ స్టేషన్ 083330 68620.ఖాజిపాలెం సబ్ స్టేషన్ 094906 15544. నెంబర్ లకు సమాచారం అందించాలి అన్నారు.

# కొణిజేటి రోశయ్య రాజకీయ అనుభవాలు ప్రత్యేకమైనవి

● రోశయ్య రెండో వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



**తెనాలి,కలంకౌంటర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర పాలనలో చెరిగిపోలేని ముద్ర వేసిన నిబద్ధతగల నాయకుడు కొణిజేటి రోశయ్య హుందాతనం నిండిన రాజకీయాలు సాగించారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గారు అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రెండో వర్ధంతి సందర్భంగా సోమవారం తెనాలిలో ఆయన విగ్రహానికి మనోహర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "కీలకమైన సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోశయ్య రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో తన వంతు కృషి చేశారు. శాసనసభలో ఎప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ అందరికీ సమాన గౌరవం ఇచ్చే రోశయ్య శాసనసభకే హుందాతనం తీసుకొచ్చారు. నిండుగా ఎప్పుడూ నవ్వుతూ, కొత్తవారిని ప్రోత్సహిస్తూ రాజకీయాలు చేశారు. శాసనసభలో రోశయ్య ఉన్నపుడు నేను శాసన సభాపతిగా వ్యవహరించడం మరచిపోలేని అనుభవం. రాజకీయాలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం నిత్యం ఆలోచించే ఆయన వ్యక్తిత్వం నేటి రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకం. పదవులు ఉన్నా, లేకున్నా ఆయన వ్యవహార శైలి ఎప్పుడు ఒకేలా ఉండేది. ప్రజలతో మమేకం కావడానికి, వారికి ఏది అవసరమో అది నెరవేర్చడానికి రోశయ్య నిరంతరం తపించేవారు. తెనాలి పట్టణానికి ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. రోశయ్య విగ్రహానికి ఆయన కుమారుడు కొణిజేటి శివ పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం పెద్దలు, తెనాలి ప్రముఖులు నూకల వేణు, పొన్నూరు శశి, ఉప్పల వరదరాజులు, మాలేపాటి హరి, కొణిజేటి గోపి, బూరెల నరసింహారావు, రావూరి సుబ్బారావు, రజనీకుమార్, చుండూరు సాయి, పెనుగొండ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటాము



**మధిర,కలంకౌంటర్ :** మధిర శాసనసభ్యునిగా నాలుగోసారి మల్లు బట్టి విక్రమార్కను గెలిపించడంలో కృషి చేసిన మధిర ప్రజలందరికీ రుణపడి ఉంటామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులు తెలుగుదేశం, సిపిఐ పార్టీల కార్యకర్తలు, అభిమానుల సంబరాల నడుమ కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా నాయకుడిగా ప్రజల సమస్యలను కష్టాలను తెలుసుకోవడానికి రాష్ట్రవ్యాప్త పాదయాత్రను నిర్వహించిన మన నేత భట్టి విక్రమార్క ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో వారందరికీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా మీ అందరి ఆశీస్సులతో మరో ఉన్నత పదవిని అలంకరించనున్నారని అన్నారు. గడిచిన మూడు నెలలుగా మధిర నియోజకవర్గ ప్రజలతో కలిసి తాను తనయుడు సూర్య విక్రమాదిత్య తో కలిసి మీ అందరి తోడ్పాటు సహకారం తో ప్రచారాన్ని నిర్వహించామని అన్నారు. మహిళా నాయకులు తో పాటు పలువురు నాయకులు బట్టి విక్రమార్క గెలుపు కోసం అనిర్వచనియమైన కృషి చేశారని పేర్కొన్నారు. ఒక దశలో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొన్న క్రమంలో వెన్నంటే ఉండి మనోధైర్యాన్ని కల్పించి బట్టి విక్రమార్క గెలుపును అఖండ విజయం గా మార్చి న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మధిర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పాటుపడే విధంగా బట్టి విక్రమార్క బాధ్యతాయుతమైన పదవిలో పని చేయనున్నారని తాము ఎల్లవేళలా మధుర ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. మధిర ప్రజలు ఇచ్చిన గెలుపు ఈ ప్రాంతానికి చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని సృష్టించేదిగా నిలవనున్నదని దీనికి అందరికీ మరో మారు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నందిని పేర్కొన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూరంశెట్టి నాగభూషణం రంగా హనుమంతరావు, పాటి బండ్ల సత్యబాబు, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కోన దని కుమార్, రంగా శ్రీనివాసరావు, నిడమానూరు వంశీ, దారా బాలరాజు, అద్దంకి రవి, తలుపుల వెంకటేశ్వర్లు, బాజీ విజయ్ కుమార్ కర్లపూడి వాసు, మొండితోక సుధాకర్ నాగార్జున, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు, టీవీ రెడ్డి,టిడిపి నాయకులు మాదల రామారావు లతోపాటు పలువురు మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంటుమిల్లి మండలంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరిపొలాలు..





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వలన ఆదివారం సోమవారాలలోకురిసిన వర్షాల వలన బంటుమిల్లి మండలంలో పలు గ్రామాలలోని కోత కోసిన వరి పనులు అలాగే కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నీట మునిగి రైతులకు తీవ్ర నష్టాన్ని గురి అయ్యారు. అలాగే మినుములు చల్లిన పొలాలు కూడా నేటి మునిగైయి. అలాగే గత రెండు రోజులుగా రైతుల హడావిడిగా నూర్చిన ధాన్యపురాసులు కల్లాల్లోనే ఉండడంతో వాటిపై పరదాలుకప్పి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని దెబ్బతిన్న వరి పంటను అన్యుమినేషన్ చేసి నష్టపరిహారం అందించాలని, అలాగే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం అపరాలు చల్లి న నీటి మునిగిన పొలాలకు సబ్సిడీపై అపరాలు ఇవ్వాలని, సబ్సిడీపై రైతులకు తార్పాలిన్లనుఅంద చేయాలని, రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులకు ,కౌలు రైతులనుప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శిగౌరిసెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వైశ్యభవన్ నందు ఘనంగా కొణిజేటి రోశయ్య వర్ధంతి





**ఒంగోలు, కలంకౌంటర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ,మాజీ తమిళనాడు గవర్నర్ స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య ద్వితీయ వర్ధంతి ఒంగోలు వైశ్య భవన్ నందు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పాల్గొన్నారు. కుప్పం ప్రసాద్ తో కలిసి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావూరి కాశీరంగ జనార్ధన్ రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య మచ్చలేని రాజకీయ నాయకులని, అలాంటి రాజకీయ నాయకుడు మనందరికీ ఆదర్శమని అన్నారు.గొప్ప వ్యక్తి కి శిష్యులుగా ఉండటం అదృష్టం అని అన్నారు. అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ రోశయ్య లాంటి గొప్ప వ్యక్తి మన ఆర్యవైశ్యుడు కావడం మనకు ఎంతోగర్వ కారణం అని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అని అన్నారు. అనంతరం కుప్పం ప్రసాద్ చేతుల మీదుగా పేదలకు బట్టలు, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు, ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, పెనుగొండ శ్రీను, అనుమాల శెట్టి సుబ్బారావు, కూరపాటి సత్యనారాయణ, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి హరీష్ హరి, కోశాధికారి పి మురళి, పబ్బిశెట్టి శ్రీను, సమతులూరి సత్యనారాయణ, రమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎన్నికల్లో ఓటమిపై స్పందించిన 'జనసేన శతఘ్ని' టీమ్

**తెలంగాణ, కలంకౌంటర్ :** తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా 8 చోట్ల పోటీ చేసిన జనసేనకు ప్రతికూల ఫలితం ఎదురైంది. ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. దీంతో జనసేనపై ఆంధ్రప్రదేశ్‌లో పాలక పక్షం వైఎస్సార్‌సీపీ విమర్శలు గుప్పిస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో జనసేనకు ఘోర పరాభవం ఎదురైందని, పవన్ కల్యాణ్ ప్రచారం చేసినా కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని విమర్శిస్తోంది. ఈ మేరకు సోమవారం 'ఎక్స్' వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఈ పోస్టుకు 'జనసేన శతఘ్ని' టీమ్ కౌంటర్ ఇచ్చింది. గెలిచినా ఓడినా తాము తెలంగాణ ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేశామని గర్వంగా చెప్పుకోగలమని బదులిచ్చింది. ఎందుకంటే తమకు ఆంధ్రప్రదేశ్ ఒకటి.. తెలంగాణ ఒకటి కాదని పేర్కొంది. తెలుగు ప్రజల బాగుకోసం ఓటమిని భరించి పని చేస్తామని వెల్లడించింది. " వైసీపీ అధినేత జగన్ తెలంగాణాలో పార్టీని ఎందుకు ఎత్తేసినట్టు? ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి, మహానేత రాజశేఖర్ రెడ్డి గారిని ఆదరించిన తెలంగాణ ప్రజలపై మీకు బాధ్యత లేదా? "రాజన్నరాజ్యం"లో బ్రతికే భాగ్యం కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రజలకే ఎందుకు? ఎందుకంటే తెలంగాణని దోచుకుతిన్న జగన్‌కి తెలంగాణలో పోటీ చేసే నైతిక హక్కు, ధైర్యం లేవు కనుక. మానుకోట ఉదంతం పీడకలలా వెంటాడుతుంది కాబట్టి. మరి ఇన్ని మచ్చలు కింద పెట్టుకుని పార్టీ జెండా మడిచి వెనుక పెట్టుకుని పారిపోయిన మీకు తెలంగాణ ఫలితాలపై మాట్లాడే ముందు కొంచెం సిగ్గు అనిపించి ఉండాలి" అంటూ జనసేన శతఘ్ని టీమ్ గట్టి కౌంటర్ ఇచ్చింది.కాగా వైఎస్సార్‌సీపీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసిన పోస్ట్‌లో జనసేనను 'సున్నాసేన' అని అభివర్ణించింది. జనసేన అభ్యర్థులకు టీడీపీ మద్దతుదారులు ఓటు వేయలేని, పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ జనసేన డిపాజిట్లు కోల్పోయిందని విమర్శించింది.

# కక్ష పూరితంగా అన్నా క్యాంటీన్ల ధ్వంసం : మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



**విజయవాడ, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను భారీగా ప్రారంభిస్తామని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మైలవరంలో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసి 500 రోజులు పూర్తి అయిన సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. అన్నా క్యాంటీన్లలో పేదలకు దేవినేని ఉమా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అన్నా క్యాంటీన్లలో పేదలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భగా దేవినేని ఉమా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా అన్నా క్యాంటీన్లను ధ్వంసం చేసిందని మండిపడ్డారు. పేదలకు భోజనం పెట్టడమే ఎన్టీఆర్ ధ్యేయమని చెప్పారు. టీడీపీ జాతీయ అద్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాన్ని వైసీపీ ప్రభుత్వం నీరు గార్చిందని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండల కేంద్రాల్లో శాశ్వత అన్నా క్యాంటీన్లను భవనాలు నిర్మాణం చేస్తామని చెప్పారు. మైలవరంలో ఫిల్లర్ దశలో ఉన్న భవనాన్ని పూర్తి చేసి చంద్రబాబు నాయుడును తెచ్చి ప్రారంభిస్తామని దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు.

# కలెక్టరేట్ తుఫాన్ కంట్రోల్ రూమ్ లో మూడు షిఫ్టులలో సిబ్బందికి విధులు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఈనెల 3 వ తేదీ నుండి 7వ తేదీ వరకు సిబ్బందికి 3 షిఫ్టులలో విధులు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ జిల్లా కలెక్టరేట్లో తుఫాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు 08672-252572, 252000 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 3 షిఫ్టులలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండవ షిఫ్ట్, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మూడో షిఫ్టు లో సిబ్బందికి కలెక్టర్ విధులు కేటాయించారు. ఈనెల 3 వ తేదీ నుండి 7వ తేదీ ఉదయం వరకు కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

# అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దు - కలెక్టర్ హరినారాయణన్



**కందుకూరు,కలంకౌంటర్ :** జిల్లా ప్రజలకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం .హరి నారాయణన్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి. తుఫాను కారణంగా భారీ వర్షాలు,తీవ్రమైన ఈదురు గాలులు వీస్తున్నందున నేడు సాయంత్రం వరకు ప్రజలు బయటకు రావద్దని,అత్యవసర మైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.తీరప్రాంత ప్రజలు,పూరి గుడిసెల్లో వుండే వారు సురక్షిత ప్రదేశాలలో వుండాలని కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు .



తుఫాన్ పట్ల కందుకూరు నియోజక వర్గ ప్రజలు అప్రమత్తం గా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి నియోజక వర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అధికారుల సూచనలు పాటించండి జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రయాణాలు చేయవద్దు. రైతులు జాగ్రతలు తీసుకోవాలని కోరారు

**-కందుకూరు,కలంకౌంటర్ :**

## నేటితో ముగిసిన గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీ కాలం..... త్వరలో జరగనున్న ఎన్నికలు



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీకాలం సోమవారంతో ముగిసింది. మూడేళ్ల పదవీకాలంలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి స్టేడియం కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ కార్యాలయంలో కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ ,ఇతర పాలక కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మూడేళ్ల పదవీకాలంలో 14 మంది సభ్యులతో కూడిన తమ కమిటీ క్రీడల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రధానంగా క్రీడాకారులను ప్రోత్సహించడం,స్టేడియంకు ఆదాయాన్ని సమకూర్చడంలో తమ కమిటీ తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. స్టేడియం కమిటీ లో తమకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు పాలేటి చంటి, పర్వతనేని ఆనంద్ మరియు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్టేడియం కమిటీ సభ్యులు బోగ్గరపు తిరుపతయ్య, వల్లభనేని ప్రసాద్, కిలారపు రంగ ప్రసాద్, మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## తుఫాను వల్ల ప్రజలు ఎవరు కూడా భయపడవద్దు: తాసిల్దార్ కవిత



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** మిచ్చింగ్ తుఫాన్ కారణంగా పిట్టల వారి పాలెం మండలంలో అల్లూరు నక్కల వారి పాలెం ,అలకాపురంలోని మండే వారి పాలెం ,అల్లూరు రెడ్ల పాలెం ప్రజలకు పునరావాసం కోసం పునరావాస కేంద్రాల సిద్ధం చేసినట్లు కవిత తెలిపారు. తుఫాను తీవ్రతను బట్టి అక్కడ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో జరుగుతున్న పరిస్థితులను తమ సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటివరకైతే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని ఆమె స్పష్టం చేశారు. తమ సిబ్బంది గ్రామాలలో పరిస్థితుల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు అన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు కనుక ఏమైనా ఉంటే మెడికల్ క్యాంపులు కూడా సత్వరంగా సిద్ధం చేస్తామని అన్నారు. అదేవిధంగా ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ శాఖ వారు కూడా తమ సిబ్బందితో ఎప్పుడూ అందుబాటు లో ఉంటానన్నారు వీరి కోసం ఒక కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఎవరికైనా ఇబ్బంది కలిగితే 95 15 31 99 46 నెంబర్ కు సంప్రదించాలన్నారు

## స్వర్గీయ కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులర్పించిన పల్లపోతు, పెనుగొండ



**ఒంగోలు, కలంకౌంటర్ :** స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వరరావు, రాష్ట్ర వాసవి సేవా దళ్ అధ్యక్షులు మోదుకూరి శ్రీనివాసరావు, పట్టణ అవోపా అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ, ఎయిమ్స్ క్లబ్ అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసరావు గారు కలం కౌంటర్ ఇన్చార్జ్ డివిఎస్ రావు, ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి సమతులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన ఏవో రాము



**కందుకూరు,కలంకౌంటర్ :** మండలంలోని వివిధ గ్రామాలలో మిచౌంగ్ తుఫాన్ వల్ల కురిసే అధిక వర్షాలకు రబీ సీజన్లో వేసిన పంటలను మండల వ్యవసాయాధికారి వి. రాము కొండికందుకూరు, పలుకూరు, మహదేవపురం గ్రామాలను పరిశీలించి తగు సూచనలు మరియు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు,మినుము 760 ఎకరాలు, శనగ 825 ఎకరాలలో ప్రస్తుతం సాగు చేసి ఉన్నారు, పొలంలో నీరు నిల్వ ఉండకుండా సాధ్యమయినంతవరకు త్వరగా కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు పంపాలి,, అని, ప్రస్తుతం మినుము పంట శాఖీయ దశ నుండి కాయ ఏర్పడు దశ నుండి,గింజ బలపడే దశలో ఉన్నది, కావున వర్షాలు ఆగిన వెంటనే, బూడిద తెగులు సోకకుండా మైక్లోబుటాలిన్ 200 గ్రాములు మరియు 19:19:19 ఒక కేజీ ఎకరానికి పిచికారి చేయాలి అని అన్నారు అలాగే అధిక తేమ వలన శనగ లో వడలు తెగులు లేదా కుళ్ళు తెగులు వచ్చే అవకాశం కనుక వర్షం నిలచిన వెంటనే కాపర్ఆక్సీ క్లోరైడ్ 3గ్రాములు లేదా కార్బన్ డై జిమ్ 1.0గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి భూమి బాగా తడిచెలా పిచికారి చేయాలి అని తెలిజేసారు, అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాల మిశ్రమం మాక్స్ లేదా ఫార్ములా 4 ఎకరానికి ఒక కేజీ చొప్పున పిచకారి చేసి పంటలను కాపాడుకోవచ్చని తెలియజేశారు

## డి ఫార్మసీ (పాలిటెక్నిక్) సీట్లు కేటాయింపు

● సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి



**విజయవాడ,కలంకౌంటర్ :** పాలిటెక్నిక్ కళాశాలల్లో డిఫార్మసీ కోర్సుకు సంబంధించిన ప్రవేశాల కౌన్సిలింగ్ షెడ్యూలు ముగిసిందని, మొత్తం 48 కళాశాలల్లో 3044 సీట్లు ఉండగా, 531 సీట్లు భర్తీ చేసామని సాంకేతిక విద్యా శాఖ కమీషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండు సంవత్సరాల డిప్లమో ఇన్ ఫార్మసీ అడ్మిషన్ల కోసం నిర్దేశించగా, సీట్ల కేటాయింపు వివరాలను సోమవారం విడుదల చేసారు. 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ లలో 506 సీట్లు ఉండగా 223 మంది అడ్మిషన్లు పొందారు. 39 ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో 2538 సీట్లు ఉండగా 308 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ప్రవేశాల ప్రక్రియ కోసం మొత్తం అర్హత పొందిన అభ్యర్థుల సంఖ్య 762కాగా, నమోదైన అభ్యర్థుల సంఖ్య 547గా ఉంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం హాజరైన అభ్యర్థులు 540 మంది కాగా, ఆప్షన్లను ఎంపిక చేసుకున్న వారు 531 మంది ఉన్నారు. అయా కళాశాలల్లో సీట్లు పొందిన అభ్యర్దులు డిసెంబరు ఐదవ తేదీ నుండి ఏడవ తేదీ లోపు వ్యక్తిగతంగా రిపోర్టు చేయవలసి ఉంటుంది. అయితే తరగతులు మంగళవారం నుండే ప్రారంభం కానున్నాయని, విద్యార్ధులు వేగంగా వ్యక్తిగత రిపోర్టింగ్ ను పూర్తి చేయాలని ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి వివరించారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు,కలంకౌంటర్ :** ఉలవపాడు మండలంలో పలు గ్రామాలలో తుఫాన్ షెల్టర్లకు వెళ్లి, బాధిత కుటుంబాలను కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పమర్శించారు. అక్కడ కల్పిస్తున్న వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలను బాధితులకు అందజేశారు. విపరీతమైన గాలులు, భారీ వర్షం పడుతున్నా లెక్కచేయకుండా... పార్టీ నేతలతో కలిసివెళ్లి, మేమున్నామంటూ బాధితులకు ఇంటూరి నాగేశ్వరరావు భరోసా కల్పించారు. మన్నేటికోట వద్ద జివిఆర్ సంఘంలో ఉన్నవారిని,ఉలవపాడులోని కోటిరెడ్డి గుంట కాలనీలో, అక్కడివారు పడుతున్న బాధలను చూసి నాగేశ్వరరావు చలించిపోయారు. ఇళ్లచుట్టూ వరదనీరు చేరుకున్నప్పటికీ, వారంతా అక్కడే ఉండడాన్ని గమనించి ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ శోభిక అక్కడికి వచ్చారు. వివిధ చోట్ల పునరావాస కేంద్రాలలో వసతులు సరిగా కల్పించని విషయాన్ని నాగేశ్వరరావు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సబ్ కలెక్టర్ బదిలిస్తూ అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కరేడు పంచాయతీలోని బాలకోటయ్య సంఘం వద్ద పునరావాస కేంద్రానికి నాగేశ్వరరావు వెళ్లారు. పార్టీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, అంచుపోగు వాసు, తొట్టెంపూడి మాల్యాద్రి, మల్లవరపు వెంకటరావు, కత్తి శివ, శ్రీను, చిమ్మిరి మోహన్ రావు, గొత్తుల జనార్ధన్, రాచగర్ల శివ తదితరులు నాగేశ్వరరావు వెంట ఉన్నారు.

## డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ను ఘనంగా సన్మానించిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం



**ఒంగోలు, కలంకౌంటర్ :** డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఒంగోలు ఢిల్లీ హైవే హొటల్ నందు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం వారు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్ర స్వామి ని ఒంగోలులో ఘనంగా సన్మానించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తిరుమల నుంచి శ్రీవారి దర్శనం అనంతరం వస్తున్న క్రమంలో మా విజ్ఞప్తి మేరకు ఇక్కడకు వచ్చి మా ఆతిథ్యాన్ని స్వీకరించడం ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావూరి కాశీరంగ జనార్ధన్, ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు,ఒంగోలు నగర అధ్యక్షులు రాజా,యువజన సంఘం ప్రధాన కార్యదర్శి హరి హరి, కోశాధికారి పి మురళి,రమేష్ తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## తుఫాను కారణంగా జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు ఇంటర్, డిగ్రీ కళాశాలలకు శెలవు - జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు



**విజయవాడ,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందన్నారు. ఈ నేపథ్యంలో విస్తారంగా కురుస్తున్న వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు 5వ తేదీ మంగళవారం శెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం శెలవు దినంగా ప్రకటించామని మంగళవారం అంగన్వాడీ కేంద్రాలకు శెలవు ప్రకటించినందున గర్భవతులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు తరలి రవ్వొద్దని కొరారు. అలాగే పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలకు శెలవు ప్రకటించినందున యజమాన్యాలు తగు చర్యలు తీసుకొని శెలవు దినాన్ని పాటించాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## కలెక్టరేట్ తుఫాన్ కంట్రోల్ రూమ్ లో మూడు షిఫ్టులలో సిబ్బందికి విధులు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఈనెల 3 వ తేదీ నుండి 7వ తేదీ వరకు సిబ్బందికి 3 షిఫ్టులలో విధులు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ జిల్లా కలెక్టరేట్లో తుఫాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు 08672-252572, 252000 ఫోన్ నెంబ ర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 3 షిఫ్టులలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండవ షిఫ్ట్, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మూడో షిఫ్ట లో సిబ్బందికి కలెక్టర్ విధులు కేటాయించారు. ఈనెల 3 వ తేదీ నుండి 7వ తేదీ ఉదయం వరకు కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి



**కందుకూరు,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాను ప్రభావంతో ముంపు గ్రామాల కోసం కందుకూరు ఏఎంసి కార్యాలయం ఆవరణంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో తల దాసుకుంటున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వాటిల్లకుండా ఆహారము, మంచినీరు విద్యుత్ సౌకర్యంతో పాటు అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏ చిన్న సమస్య వచ్చిన ఎప్పటికప్పుడు పునరావాస కేంద్రాలకు సంబంధించిన సమాచారం తెలియజేయాలని అధికారులకు సూచించారు.

## శ్రీ అయ్యప్ప స్వామి అన్నప్రసాద వితరణ భవనానికి రూ 1,01,116/- విరాళం అందించిన మర్రిపూడి బ్రదర్స్



**కందుకూరు,కలంకౌంటర్ :** కనిగిరి రోడ్ లో ఉన్న "శ్రీ అయ్యప్ప స్వామి" గుడి వెనక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనముకు కందుకూరు వాస్తవ్యులు మర్రిపూడి. పోతురాజు ధ?ప? పున్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మర్రిపూడి.శ్రీను ప్రసాద్ ( లిమర్రిపూడిలి బ్రదర్స్ ) అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కొరకు రూ?. 101,116/- విరాళము అందించినారు. ఈకార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు కేఎస్ .వెంకటేశ్వర్లు(గురుస్వామి) ఇస్కాల.వెంకట నరసింహ నల్లబోతుల.మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా.చెంచురామయ్య, దాసరి.శ్రీనివాసులు, ఉన్నం.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి విరాళం



**కందుకూరు,కలంకౌంటర్ :** కనిగిరి రోడ్ లో ఉన్న "శ్రీ అయ్యప్ప స్వామి" గుడి వెనక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనముకు కందుకూరు వాస్తవ్యులు లిగుడిపూడి కోటేశ్వరరావులి ధ?ప? లిలిరమణమ్మలి అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కొరకు రూ?. 50,116/- విరాళము అందించినారు. ఈకార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు(గురుస్వామి) ఇస్కాల.వెంకట నరసింహ నల్లబోతుల.మురళి, మాదాలవెంకటేశ్వర్లు, కాటా.చెంచురామయ్య, దాసరి.శ్రీనివాసులు, ఉన్నం.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం వాసవి సత్రంలో ఘనంగా రోశయ్య వర్ధంతి

● వాసవి సత్ర సిబ్బందికి దుప్పట్లు పంపిణీ



**శ్రీశైలం, కలంకౌంటర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా శ్రీశైలం వాసవి వివాహనందు రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ అపర చాణిక్యుడు, రాజకీయ దురంధరుడు కొణిజేటి రోశయ్య వర్ధంతిని వాసవి సత్రం నందు ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. రోశయ్య లాంటి గొప్ప వ్యక్తి ఆర్యవైశ్యుడైనందుకు, ఆయన శిష్యుడుగా మేము ఉన్నందుకు మాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా రోశయ్య తో తనకున్న అనుబంధాన్ని దేవకి గుర్తు చేసుకున్నారు. అనంతరం వాసవి సత్రంలో ఉన్న సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సత్ర సముదాయాల గౌరవాధ్యక్షులు శిద్దా నాగేశ్వరరావు, మార్కండేయులు, గణపతి, జనార్ధన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు స్కూళ్లకు సెలవు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లోని స్కూళ్లకు రేపు కూడా సెలవు ప్రకటించారు.కృష్ణా,ఎన్టీఆర్, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మంగళవారం అన్ని రకాల పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్లు తెలిపారు.రేపు తుఫాను నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటనుంది.దాని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో కుండపోత వర్షాలు పడుతున్నాయి.

# జోరు వానలో యువ నాయకుడు పేర్ని కిట్టు పర్యటన







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తుఫాన్ హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా భారీ వర్షం లో పలు గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శిస్తూ వారికి ఇంకా ఏమన్నా సమస్యలు ఉంటే తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను తెలియజేస్తూ యువ నాయకులు పేర్ని కిట్టులిపర్యటించారు. మై చౌంగ్ తుఫాన్ నేపథ్యంలో మండలంలో సముద్రతీరం గ్రామంలో పరిశీలించిన యువ నాయకులు పేర్ని కిట్టు

# ఏపీ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి







**విజయవాడ,కలంకౌంటర్ :** స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో 40,46,51 డివిజన్లలో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సచివాలయంలో అమర్చిన పేదలకు చేకురిన లబ్దిని వివరించే బోర్డును ఆవిష్కరించి సచివాలయం పరిదిలో ఏర్పాటు చేసిన జండా దిమ్మను ఆవిష్కరించారు అనంతరం స్థానిక పెద్దలతో ముఖ ముఖి కార్యక్రమం నిర్వహించారు.ప్రజలనే తీర్పు చెప్పమని కోరుతున్నాం ప్రజలు చక్కటి స్పందన ఇస్తున్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల అంజనేయ రెడ్డి,51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్,మనోజ్ కొఠారి,గౌస్ మొహిద్దిన్,యశోధర్,కేసరి కృష్ణారెడ్డి పార్టీ నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఇబ్బందులు

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర.





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తుఫాన్ ప్రభావంతో చేతికి అందించిన పంట నీట మునగడంతో మచిలీపట్నం నియోజకవర్గం గుండు పాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర. కొల్లు మాట్లాడుతూప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు రైతాంగం కళ్ళలో నీళ్లు కనబడుతున్నాయి. ఎంతగానో కష్టపడి పంట పండించుకుని ధాన్యం ద్వారా శ్రమకి ఫలితం వస్తుందినే సమయానికి తుఫాను వలన మొత్తం కూడా నీళు పలు అయింది. దాదాపు వరి పండం దక్కింది పడిపోయి నీళ్లలో తేలుతు ధాన్యం కుళ్ళు పోతుంది. ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే. గతంలో కూడా మేము చాలాసార్లు చెప్పాము. కాలువల్లో ఎప్పటికప్పుడు మట్టి తీయకపోవడం వలన ఎక్కడకక్కడ నీరు నిలిచిపోయి పంట పొలాలు పడిపోయే దానికి కారణమయ్యింది. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎక్కడ కూడా ఒక చెంచాడు మట్టి తీయలేదు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు జూన్ మాసం కల్లా నీళ్లు ఇచ్చి సెప్టెంబర్ అక్టోబర్ మాసానికి పంటపొలాలు చేతికందే విధంగా చేశారు. దాని ద్వారా నవంబర్, డిసెంబర్ లో వచ్చే తుఫాన్లు తప్పించుకునే దానికి ఆలోచన చేశారు. నీళ్లు సకాలంలో అందించడానికి పట్టిసీమ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తే ఈ ప్రభుత్వం దానిని విస్మరించి ప్రాజెక్టును నీరుగార్చింది. ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుకి అసలు ఆ శాఖ కోసం కనీసం అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులను నీరుగార్చడం వలన సకాలంలో నీళ్లు అందించక చేతికందిన పంటను కోల్పోయారు రైతన్నలు. గత ప్రభుత్వంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగానే వాళ్ళకి రేషన్ ఇచ్చి, నిత్యాసర సరుకులు ఇచ్చి ఆదుకునేది. ఈరోజు కనీసం వచ్చి పలకరించే నాధుడు లేకపోవడం బాధాకరం. ధాన్యం నష్టపోయిన రైతం గాని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. రైతాంగం పక్షాన పోరాటం కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందుంటుంది. కృష్ణాజిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ. తుఫాను కారణంగా కృష్ణాజిల్లాలో రైతాంగం మొత్తం బోరున విలపిస్తుంది. దీనికి కారణం ప్రభుత్వమే. రైతులకు అనేక కండిషన్లో పెట్టి, జిపిఆర్ఎస్ అనే సిస్టమును తీసుకొచ్చి, అది అయితే కానీ ప్రభుత్వం సబ్సిడీ కింద తీసుకొని పరిస్థితి. రైతులని నట్టేటే ముంచే ప్రభుత్వం వైసీపీ. రైతులకి కండిషన్స్ పెట్టకుండా వారికి నచ్చే మిల్లల్లో ధాన్యాన్ని అమ్ముకునే విసులుబాటు తక్షణమే కల్పించాలి. ప్రతి రైతు ఎకరానికి 30 నుంచి 40 వేల రూపాయల వరకు నష్టపోతున్నాడు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చేతికి అందిన పంటని సరైన సమయంలో ప్రభుత్వం సాకారం అందించకపోవడంతో తుఫాను వచ్చి పంట పొలాలని నీట మునిగిపోతున్నాయి. కోతకొచ్చిన పంటని కొత మిషన్ల ద్వారా సరైన సమయానికి ప్రభుత్వం సహాయం అందించి కోయించినట్లయితే ఈ రోజు ఈ పరిస్థితి ఉండేది కాదు. మాజీ జడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్,కాగిత గోపాలరావు, లంకె శేషగిరి,సలీం,వన రాజు,చిన్నం శేఖర్, లింగం విజయ్, రాయన శివ, పిన్నింటి అయ్యప్ప తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొణిజేటి రోశయ్య కు ఘన నివాళి





**విజయవాడ,కలంకౌంటర్ :** మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది.శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని రోశయ్య కాంస్య విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు,విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిగ్జామ్ తుపాను ఎఫెక్ట్.. చంద్రబాబు శ్రీశైలం పర్యటన వాయిదా

- శ్రీశైలం మల్లన్న దర్శనాన్ని వాయిదా వేసుకున్న టీడీపీ అధినేత
- మిగ్జామ్ తుపాను తీవ్రత దృష్ట్యా నిర్ణయం
- త్వరలోనే శ్రీశైలంతోపాటు కడప దర్గా, మేరీమాత చర్చిల సందర్శన



**విజయవాడ, కలంకౌంటర్ :** మిగ్జామ్ తుపాను ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం వం-కు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉండడంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలం పర్యటనను వాయిదా వేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఆయన శ్రీశైలం మల్లన్నను దర్శించుకోవాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయి. అయితే తుపాను ప్రభావం తగ్గిన తర్వాత దర్శించుకోవాలని అధినేత నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలావుంచితే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ లభించిన నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీలోని దేవాలయాలను సందర్శిస్తున్నారు. ఈ మధ్యే తిరుమలలో శ్రీవారిని, విజయవాడలో కనకదుర్గమ్మ, సింహాచలంలో అప్పన్నను దర్శించుకున్నారు. త్వరలోనే శ్రీశైలం మల్లన్నతోపాటు కడప దర్గా, మేరీమాత చర్చిలను ఆయన సందర్శించనున్నారు. కాగా ఆలయాల సందర్శనకు వెళ్తున్న చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతాలు పలుకుతున్నాయి. భారీ ర్యాలీలతో అధినేతకు మద్దతుగా నిలుస్తున్నాయి.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com